జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 26-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 83 పేజీలు: 4 వెల: రూ.7

# జ్వరాల పంజా



హిరమండలం, జులై 25 (వార్త): వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ప్రబలుతున్నాయి. దగ్గు, జలుబు, తలనొప్పి, నీరసం, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరోచనాలు, జ్వరం తదితర లక్షణాలతో ప్రజలు కొందరు మంచం పట్టారు. మరికొందరు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. జ్వరం వచ్చిందని... రక్తపరీక్షలు నిర్వహిస్తే... తెలుపు రక్త కణాలు అమాంతంగా తగ్గిపోతున్నాయి. దీంతో డెంగ్యూ జ్వరం అని భయపడి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

* జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
* ఇంటింటా జ్వరపీడితులు
* మంచం పట్టిన జిల్లావాసులు
* రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు







హిరమండలం మండలంలోని గులుమూరు గ్రామంలో ఇంటికి ఒకరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. ఒక వైపు వర్షాలు, మరోవైపు పారిశుధ్య పనులు గ్రామాల్లో సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గులుమూరు గ్రామంలో అధికంగా జ్వరాలు ఉన్నాయని సమాచారం తెలుసుకున్న జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు చొర్లంగి పిహెచ్‌సి వైద్యాధికారికి సమాచారం అందజేయటంతో వైద్యాధికారి యశ్వంత్ కుమార్ వైద్యసిబ్బందితో వెళ్లి ఇంటింటి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, ధనుపురం సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది గులుమూరు వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందేలా సహాయం చేస్తున్నారు.

# మైనర్ల.. ర్యాష్ డ్రైవింగ్





మైనర్లు అడ్డూ అదుపూ లేకుండా భవిష్యత్‌పై బెంగ లేకుండా బైక్‌లను రేసుగుర్రాల్లా తోలుతూ ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో ముగ్గురు మైనర్లు బైక్‌పై అతివేగంగా వెళుతూ ఓ యువతిని ఢీకొట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..



శ్రీకాకుళం క్రైం, జులై 25 (వార్త): ఒక పక్క పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీ చేస్తునే ఉన్నారు. మరోపక్క మైనర్లు బైక్‌పై రయ్ రయ్ మంటూ దూసుకుపోతునే ఉన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేస్తునే ఉన్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం పిల్లలపై మమకారంతో లక్షలకు లక్షలు పోసి బైక్‌లను కొంటునే ఉన్నారు.

సింగుపురం గ్రామానికి చెందిన పొట్నూరు హరిత ఆర్ట్స్ కళాశాలలో బీకాం చదువుతోంది. గురువారం ఆమె కళాశాల నుంచి బయటకు వస్తుండగా, ముగ్గురు మైనర్లు బైక్‌పై అతివేగంగా వ్తూ ఆమెను ఢీకొట్టారు. దీంతో హరితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను హుటాహుటిన 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. బైక్‌పై అతివేగంగా వస్తున్న ముగ్గురికి పట్టుకుని చితగ్గొట్టారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ అవతారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఆ ముగ్గురు మైనర్ యువకులను అదుపులోకి తీసుకున్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న హరిత వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. పోలీసులు మైనర్ల తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మైనర్ల తల్లిదండ్రులతో మాట్లాడారు. మైనర్లకు బైక్ ఇచ్చిన వ్యక్తితో పాటు ముగ్గురు మైనర్లపై ట్రాఫిక్ సీఐ కేసు నమోదు చేశారు.

* ఆర్ట్స్ కళాశాల వద్ద యువతిని ఢీకొట్టిన మైనర్లు * యువతికి తీవ్ర గాయాలు * ముగ్గురు యువకులకు దేహశుద్ధి * కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు * తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసిన ఎస్పీ

### ఇసుక రీచ్‌లో..
# ఇదేనా రక్షణ?

* అంగూరు రీచ్‌లో యూనిఫారం లేకుండా ఎక్సైజ్ కానిస్టేబుల్ విధులు
* రెవెన్యూ అధికారులు బయట కాపలా
* ఎక్సైజ్ సిబ్బంది యూనిఫారం తీసేసి నిద్రలో..
* ఇదేంటని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం

కొత్తూరు, జులై 25 (వార్త): కొత్తూరు మండలంలోని అంగూరులో ఇసుక ర్యాంపు ఉంది. ఈ ర్యాంపు నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉన్నతాధికారులు ర్యాంపు వద్ద ఓ కార్యాలయాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఎక్సైజ్, రెవెన్యూ సిబ్బందిని అక్కడ విధుల్లో పెట్టారు. పాపం రెవెన్యూ సిబ్బంది రాత్రిపూట కార్యాలయం బయట డ్యూటీ చేస్తుంటే.. ఎక్సైజ్ సిబ్బందిలో కొందరు మాత్రం హాయిగా యూనిఫారం తీసేసి హాయిగా నిద్రపోతున్నారు. అంగూరులో ఇసుక ర్యాంపును మీడియా సందర్శించిన సమయంలో ఇది వెలుగులోకి వచ్చింది. ఇదేంటని అక్కడున్న ఎక్సైజ్ సిబ్బందిని ప్రశ్నిస్తే ఎవడికి చెప్తావో చెప్పుకో అంటూ దురుసుగా సమాధానం ఇవ్వడం గమనార్హం.



## కిరాణా దుకాణాలు తనిఖీ చేసిన డిఎస్ఓ

కంచిలి జులై 25 (వార్త): కంచిలి గ్రామంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బగాది శాంతి గురువారం కిరాణా దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. కిరాణా దుకాణాల్లో కందిపప్పు కేజీ160 రూపాయలకు అమ్మాలని యజమానులను ఆదేశించారు. 160 రూపాయల కన్నా ఎక్కువ అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఎస్డిటి కూర్మారావ్ పాల్గొన్నారు.



## సచివాలయ సిబ్బందికి
# యూనిఫాం లేనట్టేనా..?

**- సిబ్బంది పాటించని యూనిఫామ్ కోడ్**

**- ప్రభుత్వం మారిన.. మారని సిబ్బంది తీరు..**



సంతబొమ్మాళి, జులై 25 (వార్త): గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బందికి యూనిఫామ్ తప్పనిసరి చేయగా, ఇప్పటి టీడీపీ ప్రభుత్వం మారిన సచివాలయం సిబ్బందికి యూనిఫామ్‌పై ఎటువంటి కొత్త ఆచరణలు విడుదల చేయకపోయినప్పటికీ, సిబ్బంది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అభాసుపాలు అవ్వటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయానికి వచ్చే సమయంలో అక్కడ





అధికారులు ఎవరో లబ్ధిదారులు ఎవరో గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని సచివాలయాలలో చూస్తే ఉద్యోగులు సమయానికి రాకపోవడం, వచ్చిన వాళ్ళు ఏం పని చేస్తున్నారు ఎవరు వస్తున్నారు ఎవరు వెళ్తున్నారో పర్యవేక్షించే నాధుడే లేడు. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా వాళ్లకి నియమించిన యూనిఫామ్ కోడ్ కూడా పాటించకపోవడంతో పలు విమర్శలు ఉండనే ఉన్నాయి. ప్రభుత్వం మారిన ఇంకా సచివాలయ సిబ్బంది తీరు మారలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గురువారం విలేకరి బృందం లక్కివలస , మేఘవరం, లింగూడు, హెచ్ ఎన్ పేట, సచివాలయాలను పరిశీలించగా సిబ్బంది ఏ ఒక్కరు కూడా యూనిఫామ్ కోడ్ పాటించకపోవడం గమనార్హం. దీనిపై ఎంపీడీవోను వివరణ కోరగా యూనిఫామ్ మార్పులపై ఎటువంటి జీవోలు రాలేదని, యూనిఫామ్ తప్పనిసరిగా సచివాలయ సిబ్బంది ధరించాలని ఆమె తెలిపారు. ఇకపై సచివాలయాలు పర్యవేక్షించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## కొనసాగుతున్న
## గొండు శంకర్ అన్నా క్యాంటీన్







శ్రీకాకుళం, జూలై 25 (వార్త): ప్రభుత్వ అన్నా క్యాంటీన్ మూతపడడంతో ప్రత్యామ్నాయంగా గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన అన్నా క్యాంటీన్ ఉచిత భోజన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతూ పేదలకు అండగా నిలుస్తోంది. నగరంలోని పేదలు, ఆనాధలు, అభాగ్యులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే అన్నార్తులకు సైతం ఆకలి తీరుస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. మండు వేసవిని, వర్షాకాలాన్ని లెక్క చేయక నేటికీ 462 రోజులుగా పేదోడి కడుపు ఒక్కపూటైనా నిండాలన్న గొండు శంకర్ ఆశయానికి అనుగుణంగా అన్నా క్యాంటీన్ సిబ్బంది కృషి చేస్తున్నారు. నాణ్యతలో లోటు రానివ్వకుండా, రుచికరమైన భోజనాన్ని వండి వడ్డిస్తున్నారు. అడిగిన వారికి లేదనకుండా తిన్నవారు సంతృప్తి చెందడమే తమ ఆనందంగా భావిస్తూ అన్నా క్యాంటీన్ కొనసాగుతోంది.



# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

మందస, జులై 25 (వార్త): మందస మండలంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని మందస మండలం ఆదివాసీ గిరిజన శ్రీకాకుళం జిల్లా కమిటీ నాయకులు కోరారు. కమిటి బృందం గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడంబో ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో అంబులెన్స్ మంజూరు చెయ్యాలని, పీడరు అంబులెన్స్ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో ఆరోగ్య కార్యకర్తలు నియామకం జరపాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు నేరుగా కాస్మొటిక్ చార్జీలను అందించాలని, హాస్టల్స్ లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. మందస సంక్షేమ బాలురు హాస్టళ్లలో హెచ్ఎం, ఇంగ్లీషు, లెక్కలు ఉపాధ్యాయులు లేనందున ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నాడు-నేడు కార్యక్రమంలో మందస సంక్షేమ హాస్టళ్లలో నిర్మించిన భవనాలు మరమత్తులు గురైందన్నారు. తక్షణమే మరమత్తులు నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో 130 మంది ఆదివాసీ విద్యార్థులు చదువుతున్నారని, అనారోగ్యం వచ్చిన వారికి ఆరోగ్య సేవలు అందించలేని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే



సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు సవర ధర్మారావు, ఎన్.అప్పన్న, నాయకులు సవర పురుషోత్తం, సవర జైరాం కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్



మందస, జులై 25 (వార్త): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుండి 29 వరకు 7 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ యొక్క ఆట, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో చదువుతోపాటుగా ఇటువంటి బోధనేతర కార్యక్రమాలు చేపట్టడం వలన విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంపొం దుతుందని, తద్వారా వారు అన్ని రంగాల్లో రాణిస్తారని ఆయన తెలిపారు. మొదటి రోజు టీఎల్ఎం ప్రదర్శన, రెండవ రోజు పునాది అభ్యాసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యం, మూడవ రోజు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఉపాధ్యాయులు ఎం.దామోదరం, జి.భీమారావు, ఎం.లక్ష్మణ రావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, ఎం.చిత్రసేను, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం



కంచిలి, జులై 25 (వార్త): కంచిలి మండలం కర్తలి గ్రామానికి చెందిన బుడ్డేపు ప్రవీణ్ బ్లడ్ క్యాన్సర్‌తో విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్యాన్సర్ వ్యాధికి గాను 25 లక్షలు ఖర్చు అవుతున్న విషయాన్ని తెలుసుకున్న ఉద్దాన సేవా సమితి సంస్థ సభ్యులు తమ వంతు సహాయంగా పదివేల రూపాయలు నగదును ప్రవీణ్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో ఉద్దానం సేవా సమితి సంస్థ వ్యవస్థాపకుడు తారక్, ఉపాధ్యాయుడు బి.కామేష్ రెడ్డి, సేవా సంస్థ సభ్యులు వాసాల రమేష్ రెడ్డి, పైల సూర్యనారాయణ రెడ్డి, కర్తల గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



కొత్తూరు, జూలై 25 (వార్త): ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తూరు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు నుండి మెట్టూరు వెళ్లే 11/కేవీ ఫీడర్ మెయింటెనెన్స్ పనుల నిర్వహణ నిమిత్తం మెట్టూరు, గూనభద్ర, నీలకంఠపురం తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు. కావున ప్రతి ఒక్కరు అప్రమత్తమై విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాని కోరారు.

## లైంగిక వేధింపుల నిరోధక కమిటీల ఏర్పాటు

మందస, జులై 25 (వార్త): మహిళలు పని చేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ అరసాడ రఘుపతిరావు, ఐసీడీఎస్ సీడీపీఓ కె.వసుంధరాదేవి అన్నారు. మందస పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం మందిరంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోస్యాక్ట్-2013, బీఎన్ఎస్-2023 ప్రకారం ఈ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ కార్యాలయంలో కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పురుషులతో సమానంగా పని చేసే సమానత్వానికి భంగం కలిగించి, మహిళల హక్కులను కాలరాసే వేధింపులు నశించాలన్నారు. మహిళలు, సిబ్బంది పట్ల సముచిత గౌరవం లేకుండా ప్రవర్తించకూడదన్నారు. అటువంటి వారిపై కమిటీ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.భాస్కరరావు, మందస పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి బూరగాన ఋష్యేశ్వరరావు, ఏపీఎం గొడబ ప్రసాదరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, బి.మంగమ్మ, పి.జయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పిన్నింటిపేట పాఠశాలలో మొక్కల నాటిన రామచంద్రరావు

పోలాకి, జలుమూరు జూలై 25 (వార్త): పోలాకి మండలం పిన్నింటిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ సంస్థ తరఫున పది లక్షల మొక్కలను నాటి వాటిని పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయాలలో మారేడు, నేరేడు, ఉసిరికి, జమ్మి, మొదలగు మొక్కలు కూడా పెంచుతున్నట్లు తెలిపారు.



## అక్కురాడలో పొలంబడి



జలుమూరు జులై 25 (వార్త): జలుమూరు మండలం అక్కురాడ గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలమల రామరాజు అను రైతు పొలంలో శ్రీ సాగు పద్ధతిలో నాట్లు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలుమూరు వ్యవసాయ అధికారి కొంకెన సురేష్, వ్యవసాయ సహాయకులు వాసుదేవరావు, నవ్య, శివ చరణ్ రైతులు పాల్గొన్నారు.

## లింగాలవలసలో తాగునీటి కష్టాలు



జలుమూరు జులై 25 (వార్త): జలుమూరు మండలం లింగాలవలస గ్రామంలో వారం రోజులుగా మంచి నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం కావటంతో మంచినీటి బావులు బురద నీటిత నిండిపోయాయి. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మాకివలసలో ఉచిత ప్రధమ చికిత్స శిబిరం



నరసన్నపేట, జలుమూరు జూలై 25 (వార్త): నరసన్నపేట మండలం మాకివలస సచివాలయంలో ఉచిత ప్రధమ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశామని వైద్యాధికారి విజయ్ కుమార్ తెలిపారు. సచివాలయం పరిధిలో జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించి శిబిరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ క్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతేకాకుండా ఇంటింటి సర్వే కూడా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి వద్దనే పశు వైద్య సేవలు



నరసన్నపేట, జలుమూరు జూలై 25 (వార్త): జిల్లా పశు వైద్య శాఖ ఆదేశాల మేరకు నేరుగా పాడి రైతుల ఇంటి వద్దనే పశువులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని లైవ్ స్టాక్ సహాయకులు వైకుంఠరావు తెలిపారు. గురువారం లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను నేరుగా రైతుల ఇంటి వద్దకే వెళ్లి అందించారు. నరసన్నపేట సచివాలయ పరిధిలో 300 ఆవులకు టీకాలు వేశామని ఆయన తెలిపారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు



నరసన్నపేట, జలుమూరు జూలై 25 (వార్త): నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపకుల నియామక భర్తీకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్లకు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తులను అందించాలన్నారు.

## జిల్లాకు చేరుకున్న నూతన జేసీ: నేడు బాధ్యతలు స్వీకరణ



శ్రీకాకుళం, జూలై 25 (వార్త): జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం బదిలీపై జిల్లాకు చేరుకున్నారు. అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహించి బదిలీ పై వచ్చిన ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలెక్టర్ బంగ్లాలో గౌరవ పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించనున్నారు.

## శిరస్త్రానంపై అవగాహన

శ్రీకాకుళం, జూలై 25 (వార్త): శ్రీకాకుళం పట్టణంలో హెల్మెట్ ధారణ, మైనర్ డ్రైవింగ్, రోడ్డు భద్రత నియామలపై ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు, విద్యార్థులు, యువకులకు ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ అవగాహన కల్పించారు.




# మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా సీఆర్‌జెడ్ అమలు చేయాలి

శ్రీకాకుళం, జూలై 25 (వార్త): మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా సీఆర్‌జెడ్ అమలు చేయాలని జిల్లాలోని తీరప్రాంత ప్రజలు కోరారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు శ్రీకాకుళం జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ ఖరారు నిమిత్తం సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నోటిఫికేషన్ విడుదలపై తీర ప్రాంత ప్రజలు, అధికారులతో ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధ్యక్షత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేంలో ఆయన మాట్లాడుతూ సీఆర్‌జెడ్ అందరూ మాట్లాడి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తెలియజేయాలన్నారు. అభిప్రాయాలను చక్కగా వివరించారని, వీటన్నింటి రికార్డింగ్ చేయడమైనదని చెప్పారు. రికార్డింగ్ ను ప్రభుత్వానికి పంపుతామన్నారు. సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు కోరారు. ఈ సందర్భంగా పలువురు వారి వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు మాట్లాడుతూ ఈ సమావేశం లో వ్యక్తపరిచిన అభిప్రాయాలూ సూచనలు, సలహాలు అభ్యంతరాలు ఎటువంటి మార్పులు లేకుండా రిపోర్ట్ తయారుచేసి ప్రైసైడింగ్ అధికారి అనుమతితో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ కు పంపించడం



జరుగుతుందని తెలియజేసారు. ఈ సమావేశంలో డిపిఓ వెంకటేశ్వరరావు, కొవ్వాడ డిప్యూటీ కలెక్టర్ ఎల్.లక్ష్మణరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎ.ఈ.ఈ. హరీష్, తీర ప్రాంత మండలాలైన ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, టెక్కలి, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తీర ప్రాంత గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రైతుల త్యాగం మరువలేనిది

*- మాజీ ఎంపీపీ గొండు జగపతి*



శ్రీకాకుళం టౌన్ జూలై 25, (వార్త): నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అమరావతి రైతులు 33వేల ఎకరాల పంట భూములను అందించారని వారి త్యాగం మరువలేనిదని మాజీ ఎంపీపీ గొండు జగపతి అన్నారు. 2022 సెప్టెంబరు 12న అమరావతి టు శ్రీకాకుళం పాదయాత్ర నిర్వహించిన అమరావతి రైతులు ఆదిత్యుని దర్శించుకున్నారు. అయితే వారి ఆకాంక్ష నెరవేరడంతో పాటు మరలా అమరావతి రాజధానిగా నిర్మాణం జరుగుతుండడంతో రైతులు మరలా ఇప్పుడు అరసవల్లి ఆదిత్యుని ఆలయాన్ని దర్శించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంతో ఆయన సూచనల మేరకు మాజీ ఎంపీపీ గొండు జగపతి, టీఎన్ ఎస్ ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్‌లు అమరావతి రైతులకు సాదరంగా స్వాగతం పలికి ఆలయానికి తీసుకువచ్చారు. అమరావతి రైతులు ఆలయ ఈవో ఎస్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆదిత్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీపీ జగపతి మాట్లాడుతూ అమరావతి రైతులు ఎంతో ఇబ్బందులు పడి మూడు పంటలు పండే పంట భూములను రాజధాని నిర్మాణానికి అందించారన్నారు. రాష్ట్ర ప్రజలు అమరావతి రైతుల త్యాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. 2019లో జగన్‌మోహనరెడ్డి పాలనలో రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందుతుందని రైతులంతా ఆకాంక్షించారని, కానీ ఆ ఐదేళ్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగించారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి దేశంలో రాష్ట్ రపరువును పూర్తిగా దిగజార్చారన్నారు. అమరావతి ప్రాంత రైతులు రాజధానిగా అమరావతినే కొనసాగించాలని గతంలో అమరావతి నుండి అరసవల్లి వరకు పాదయాత్ర చేశారని తెలిపారు.



2019 డిసెంబర్‌లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమరావతిలో శాసనసభ రాజధానితో సహా రాష్ట్రానికి మూడు రాజధానులను ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రతిపాదించి ఆమోదించిందన్నారు. అప్పటి నుంచి అమరావతి ప్రాంత రైతులు అమరావతి పరిరక్షణ సమితి పేరుతో నిరసనలు మొదలుపెట్టారని వివరించారు. అప్పటి నుంచి కొనసాగుతున్న అమరావతి ఉద్యమం కూటమి ప్రభుత్వం గెలుపుతో విజయం సాధించిందన్నారు. ఇందులో భాగంగా గురువారం పుణ్యక్షేత్రమైన అరసవల్లి ఆదిత్యున్ని దర్శించుకున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు ఉంగటి రమణ మాట్లాడుతూ గొండు శంకర్ అసెంబ్లీ సమావేశాల్లో ఉండడంతో ఆయన సూచన మేరకు అమరావతి రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో గొండు శంకర్ చూపుతున్న చొరవకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయిపల్లి అర్జున, టీడీపీ నాయకులు, అమరావతి రైతులు పాల్గొన్నారు.



# జ్ఞాన సరస్వతి అవార్డు ఎంతో ఆనందాన్నిచ్చింది

ఇచ్ఛాపురం, జూలై 25, (వార్త); జ్ఞాన సరస్వతి అవార్డు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అని ఆశి కృష్ణా రెడ్డి అన్నారు. ఆయన గురువారం సాంప్రదాయ సంగీత కళాకారులు అవార్డు అందుకున్నారు. నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరి ఆర్ట్ అకాడమీ నిర్వహణలో బోనాల ఉత్సవాలు సందర్భంగా ఆల్ ఇండియా లెవెల్ డాన్స్ ఉత్సవాలు 2024 తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ రవీంద్రభారతి వేదికలో నిర్వహించారు. నాట్యమయూరి జ్ఞాన సరస్వతి అవార్డులు 2024 కార్యక్రమంలో కూచిపూడి ,భరతనాట్యం, జానపదం ,పేరని ఆంధ్ర నాట్యం, సంగీతం, బోనాల జానపదం, వివిధ కళలలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు యూపీ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన సుమారు 500 మంది కళాకారులు పాల్గొని అవార్డులు పొందారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం కు చెందిన ఆశి కృష్ణా రెడ్డి జ్ఞాన సరస్వతి అవార్డు గాత్ర కచేరిలో అందుకున్నారు .ముఖ్యఅతిథి గా వనజ ఉదయ్ (హెడ్



డిపార్ట్మెంట్ ఆఫ్ డాన్స్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ హైదరాబాద్) దేవగాను శర్మ తదితరులు చేతులు మీదుగా అందుకున్నారు. మవుడూరు జగన్నాథ్ శర్మ శిష్యునిగా కృష్ణా రెడ్డి సాధన చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పలాసలో అదనపు సబ్ స్టేషన్ మంజూరుకు ఎమ్మెల్యే శిరీష వినతి

పలాస జూలై 25 (వార్త): పలాసలో అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలాసలో అదనపు సబ్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు.



## తల్లికి వందనం వర్తింపుపై ఆప్సా హర్షం

మెళియాపుట్టి జూలై 25 (వార్త): ప్రైవేట్ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులకు సైతం తల్లికి వందనం పథకం వర్తిస్తుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడం పట్ల నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్, నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘ గౌరవధ్యక్షులు జె.జె.ఎస్. ప్రతాప్ హర్షదాయకమన్నారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా తల్లికి వందనం వర్తిస్తుందని శాసనమండలి సమావేశంలో ప్రకటించడం హర్షదాయకమాన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నడపబడుతున్న బడ్జెట్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం ఎంతో మేలు చేసినట్లు అవుతుందని, అలాగే బడ్జెట్ స్కూల్ మనుగడకు ఎంతో మేలు కాగలదని అన్నారు. దీనిపై మెళియాపుట్టి మండలంలో గల ప్రవేటు స్కూల్ కరస్పాండెంట్లు, డైరెక్టర్లు ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గురువారం మండల కేంద్రంలో గల నలంద పబ్లిక్ స్కూల్లో జరిగిన ఈ



సమావేశంలో ప్రైవేట్ సంస్థల కరస్పాండెంట్లు జె.జె.యస్.ప్రతాప్, కలమట శేఖర్, నల్లకాంతం చిన్నిక్రిష్ణ, సుగ్గు ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలి



మందస, జులై 25 (వార్త): పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలని మందస మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. మందస మండలం మధ్య గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి వైరస్ వల్ల వస్తుందని, వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, శరీరమంతా నొప్పితో కూడిన కణతలతోపాటు పుండ్లు ఏర్పడి పాలు దిగుబడి కూడా తగ్గుతుంది అని తెలియజేశారు. మండలంలో 12,400 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని పాడి రైతులు ఈ టీకాలను తమ సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, హరికృష్ణ పురుషోత్తంతో పాటు పాడి రైతుల డొక్కా లక్ష్మీనారాయణ, మాధవరావు, రామకృష్ణ, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ హాస్టల్‌కు ఉచితంగా త్రాగునీరు అందించిన రమణమూర్తి






సంతబొమ్మాళి, జులై 25 (వార్త ): ఏదైనా అవసరం ఉందని చెబితే నేనున్నానంటూ ముందుకొచ్చి వారిలో లక్ష్మి పురం గ్రామానికి చెందిన తంగి రమణమూర్తి ఒకరు. సామాజిక కార్యకర్త, తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నాయకుడైన రమణమూర్తి మండల కేంద్రం సంతబొమ్మాళి లో నిర్వహిస్తున్న కస్తూరిభా బాలికల వసతి గృహంలో ఇటీవల తాగునీటి ఇబ్బందులు వచ్చాయి. ఉన్న ఒక్క బోరుబావి నీరు అందించక పోవడతో ఈ పాఠశాల లో చూడుతున్న విద్యార్థిని లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం స్థానిక పాఠశాల సిబ్బంది ద్వారా రమణమూర్తి దృష్టి రాగా సుమారు నెల రోజులకు పైగా తన స్వంత ట్యాంకర్ ద్వారా రోజు ఉదయం, సాయంత్రం ఉచితంగా నీటిని అందించారు. ఇటీవల వర్షాలు పడడంతో బోరుబావి నుంచి నీరు అందడంతో ప్రస్తుతం ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా నిలిపి వేశారు.

కష్ట కాలంలో రమణ మూర్తి సాయం చేయడం వల్ల తాగు నీటిసమస్య నెరవేరిందని పాఠశాల బాలికల, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాటుసారా స్థావరాలు ధ్వంసం

శ్రీకాకుళం టౌన్ జూలై 25, (వార్త): శ్రీకాకుళం జిల్లాలో పూర్తి స్థాయిలో నాటు సారా తయారీ క్రయ విక్రయాలు అరికట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పోలీసులు మందస మండలంలో పట్టులోగం గ్రామంలో కొండ ప్రాంతంలో నాటు సారా తయారీ స్థావరాలను గురువారం ధ్వంసం చేశారు. ఈ దాడులలో భాగంగా నాటుసారా తయారీకి ఉపయోగించే 1100 లీటర్ల బెల్లపు ఊటను, 20 లీటర్ల నాటు సారా, ఇతర సామాగ్రిని నిర్వీర్యం చేశారు.



## నాణ్యమైన బస్సులు నడిపించాలి

శ్రీకాకుళం టౌన్ జూలై 25, (వార్త): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యవంతమైన మంచి కంట్రోల్ కలిగిన బస్సులను ఇవ్వాలని, మీ సరుకులను అత్యంత వేగంగా, భద్రంగా, దూర ప్రాంతాలకు కూడా చేరవేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని శ్రీకాకుళం-1 డిపో సి.హెచ్. రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అప్పలనాయుడు డిప్యూటీ సిటిఎం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్ కుమార్ ,పి.బి.ఎం.కే రాజు, డిపో మేనేజర్ శ్రీకాకుళం-1 ఆర్.ఎస్. శర్మ డిపో మేనేజర్-2 రవికుమార్ ,డిఈ , అసిస్టెంట్ మేనేజర్లు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## 108 వాహనం ఆకస్మిక తనిఖీ



సారవకోట, జలుమూరు జూలై 25 (వార్త): సారవకోట మండలం 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి వారు పలు సూచనలు, సలహాలు చేశారు. అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ హరికృష్ణ, టట్ సింహాచలం ఉన్నారు.

## లైంగిక వేధింపుల ఫిర్యాదుపై విచారణ

నరసన్నపేట, జలుమూరు జూలై 25 (వార్త): ప్లస్-2 చదువుతున్న విద్యార్థినులపై ఓ ఉపాధ్యాయుడు లైగింక వేధింపులకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఆ ఉపాధ్యాయుడికి మరో ఇద్దరు ఉపాధ్యాయులు సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విద్యార్థినుల ఫిర్యాదు మేరకు టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి విలియమ్స్, జీసీడీఓ నీరజ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు.

## శ్రీముఖలింగం క్షేత్రం వద్ద కుక్కల స్వైర విహారం

జలుమూరు జూలై 25 (వార్త): మండలంలోని శ్రీముఖలింగంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రం వద్ద, గ్రామ పరిసరాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల బెడద ఎక్కువ కావడంతో



స్థానికులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం కలుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


## అంగన్వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ



నరసన్నపేట, జలుమూరు జులై 25 (వార్త): అంగన్వాడి కేంద్రాలలో ఉన్న చిన్నారులకు ఆధార్ ఎన్రోల్మెంట్ చేయించేందుకు గాను చర్యలు తీసుకు ంటున్నామని నరసన్నపేట ఐసీడీఎస్ పీఓ నాగమణి తెలిపారు. ఈ మేరకు నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రంలో చిన్నారులకు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## బాలికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్

జలుమురు జులై 25 (వార్త): మండలంలోని బాలికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయిని పల్లి సుశీల విద్యార్థులకు మాతృమూర్తి రాజులమ్మ జ్ఞాపకార్థం సుమారుగా 2000రూపాయలు విలువ చేసే గ్రంధాలయ పుస్తకాలుఎ 3000రూపాయలు నగదు పాఠశాల అభివృద్ధికి ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇప్పిలి వేణుగోపాలరావు పాల్గొన్నారు.



## పాఠశాలలో భిన్నత్వంలో ఏకత్వం



గార, జూలై 25 (వార్త) : గారు మండలం అంబలవలస పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా భిన్నత్వంలో ఏకత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి ఉంటూ ఏకత్వంగా ఉండాలని తెలుపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హాస్టల్‌ను సందర్శించిన లోతుగడ్డ

కొత్తూరు,జూలై 25 (వార్త): కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠ శాలకు అనుబంధంగా ఉన్న కేజీబీవీ హాస్టల్‌ను కొత్తూరు మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీ వరప్రసాద్ గురువారం సందర్శించి విద్యా ర్థులకు కావాల్సిన సదుపాయాలు గూర్చి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.గోవిందరావు, జేఈ బుచ్చిబాబు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకట కృష్ణ, వార్డెన్ ఉమా శంకర్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



**కంచిలి జూలై 25 (వార్త):** మండలం నువగడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేస్తూ మందులు పంపిణీ చేశారు. జిపిఎస్ పాఠశాలలో చదువుకుంటున్న 267 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కూర గిన్నెలు పంపిణీ చేశారు.

## తుపాను రక్షిత భవనాలను పరిశీలించిన ఆర్డీఓ భరత్నాయక్



మందస, జులై 25 (వార్త): మందస మండలంలోని తుపాను రక్షిత కేంద్రాలను పలాస ఆర్డీఓ భరత్నాయక్ గురువారం పరిశీలించారు. ఉద్దానం ప్రాంతంలోని భేతాళపురం, రట్టి, గంగువాడ, లక్ష్మీపురం, ఎర్రముక్కాం, దున్నవూరు, గెడ్డవూరు తదితర గ్రామాల్లో గల ఈ కేంద్రాలను తహసీల్దార్ తిరుమలబాబుతో కలిసి పరిశీలించారు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థితి, గతులు తెలుసుకోవడానికి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. దున్నవూరు, గెడ్డవూరు, లక్ష్మీపురం, సిగలపుట్టుగ, బిడిమి, ఎం.గంగువాడ గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలను తనిఖీ చేశారు. తీర ప్రాంతాల్లో ఈ భవనాలు ఉండడంతో, ఈ కేంద్రాలు ఎలా ఉన్నాయో ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్టు తెలుస్తోంది. కార్యక్రమంలో ఎంఆర్ఐ ఎస్.చిన్నబాబు ఉన్నారు.

## నేడు మాజీ సైనికుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పలాస జూలై 25 (వార్త): సైనికులు సరిహద్దుల్లో శత్రువుల నుండి ప్రాణాలు కాపాడడమే కాదు సమాజంలో కూడా రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి అనే ధ్యేయంతో కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా శుక్రవారం మాజీ సైనికుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మాజీ సైనికులు వారి సహకారంతో శ్రీ పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరగనుంది. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## ఎంపీడీఓ మృతికి సంతాపం




మెళియాపుట్టి జూలై 25 (వార్త); నరసాపురం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తూ వెంకటరమణ మృతి చెందడంతో స్థానిక మండల పరిషత్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నరసాపురం ఎంపిడివో వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడివో భాస్కరరావు మాట్లాడుతూ వెంకటరమణ మృతి చెందటం బాధాకరమన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీడీవోతో పాటు మండల పరిషత్తు ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

## మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయండి

### ఎమ్మెల్యే ఎం.జి.ఆర్



కొత్తూరు,జూలై 25 (వార్త): గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో కొత్తూరు మండలానికి మంజూరైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మన్యం జిల్లాలోని సీతంపేటకు తరలించారని, యధావిదిగా మరల కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే ఏర్పాటు చేసేటట్లు చూడాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సచివాలయంలో గురువారం పాతపట్నం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే పాతపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లలో వైద్యులు,పరికరాలు, మందులు కొరత లేకుండా తగు చర్యలు చేపట్టాలని అలాగే వైద్య సేవలను మరింత అందించేందుకు 50 పడకలు గల పాతపట్నం ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని వినతిపత్రం సమర్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రి తీరు మారదా

**- అస్తవ్యస్తంగా బోరుబద్ర ఆసుపత్రి**

**- జాడ లేని లక్కివలస ఎంఎల్‌హెచ్‌పి**

**- ఆరోగ్య మిత్ర ఎక్కేసిన వైద్యాధికారిణి**






సంతబొమ్మాళి, జూలై 25 (వార్త): ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేందుకు రూ. కోట్లతో అన్ని వసతులు కల్పిస్తున్నామని ఇటు పాలకులు అటు అధికారులు గొప్పలు చెబుతున్నారు. అయితే మండలంలో బోరుభద్ర ఆసుపత్రి పనితీరు చూస్తే ఇక్కడ అందుకు భిన్నంగా ఉంది. బోరుబద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కడ చూసినా మందులు అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. బాత్రూములలో పీపీ కిట్లు చెత్త కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రోగులకు ఇవ్వాల్సిన మందులు ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలుగా పడి



ఉండడంతో ఇస్తున్న మందులు కాలం చెల్లినవా మంచివా అంటూ పలువురు



అనుమానాలు వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆసుపత్రిలో ఏఎన్ఎంలకు, వైద్య సిబ్బందికి ఆదర్శంగా నిలవాల్సిన వైద్యాధికారిణి ఆరోగ్య మిత్ర కౌంటర్‌పై కూర్చునే విధానమే విద్యాధికారిణి పనితీరుకు అద్దం పడుతోంది. అలాగే లక్కివలస విలేజ్ క్లినిక్ హెల్త్ సెంటర్‌లో ఉండాల్సిన ఎంఎల్‌హెచ్‌పి రెండు నెలలుగా జాడ లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. లక్కివలస విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కొన్ని సందర్భాల్లో వైద్య సేవలు అందక పలువురు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లో కొన్ని సందర్భాల్లో ఏఎన్ఎంలు ఆశలు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై బోరుభద్ర వైద్యాధికారి డాక్టర్ అవినీకి వివరణ కోరగా లక్కివలస ఎమ్ఎల్‌హెచ్‌పి లాస్ ఆఫ్ పేలో సెలవులు తీసుకున్నారని తెలిపారు. బోరుభద్ర ఆసుపత్రి డాక్టర్ రెడ్డిస్ కంపెనీ ఆధ్వర్యంలో నాడు నేడు పనులు అవుతున్నాయని, పూర్తయిన వెంటనే అన్ని గదులు వినియోగంలోకి వస్తాయన్నారు.

# జలదిగ్బంధంలో పూడిలంక

### పూడిలంకను సందర్శించిన ఎమ్మెల్యే గౌతు శిరీష





**వజ్రపుకొత్తూరు, జులై 25 (వార్త):** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పూడిలంక పైనే ఆ ప్రభావం ఎక్కువ పడుతోంది. చుట్టూ ఉప్పుటేరు మధ్యలో పూడి లంక గ్రామం ఉండటం వల్ల భారీ వర్షాలు, వరదలు, తుఫానులు వంటివి సంభవిస్తే గ్రామ ప్రజలు జనజీవన స్రవంతికి దూరమౌతారు. కాలి బాటగా ఉన్న గట్టే ఆ గ్రామ ప్రజలకు రహదారి అయింది. మూడు తరాలుగా రహదారి లేని గ్రామం గా ఉండి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూడి లంక గ్రామం జలదిగ్బంధానికి గురైంది. సముద్రంకు ఉప్పుటేరు కనెక్షన్ ఉండటం వల్ల ఇసుక మేట పడటంతో పోగురు పడింది. దీంతో వరద నీరు ఎటూ వెళ్లక ఉండి పోవటంతో నువ్వలరేవు గ్రామస్తులు అంత మంది పోగురులో మేట వేసిన ఇసుకను త్రవ్వి తొలగించి పూడి లంక గ్రామ ప్రమాదం నుంచి తప్పించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గ్రామ ప్రమాద పరిస్థితిని తెలుసుకొని హుటా హుటిన ఇంజిన్ తెప్పపై వెళ్లి ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చారు. సగం పనులతో ఆగిపోయిన రహదారి పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే శిరీష హామీ ఇచ్చారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413